

నేటి నుంచి అట్టక్కలారి ఉత్సవాలు

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అట్టక్కలారి ఇండియా 11వ ఎడిషన్ ఉత్సవాలు నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక పర్యాటకశాఖ సహకారంతో నగరంలోని మాక్స్‌ముల్లర్ భవనంలో 10న జీవ ప్రవాహ అనే రూపకాన్ని ప్రదర్శించనున్నారు. పర్యావరణ సంరక్షణ అవసరాన్ని చాటి చెప్పేలా ఈ రూపకాన్ని సిద్ధం చేశారు. 16న రంగశంకరలో పాలింపెస్ట్, 17న వెంగోజోండో, 18న జానీ హాట్ ఈజ్ గన్ తదితర విదేశీ నాటకాలను ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.

వేసవికి ముందే జలాశయాలు వెలవెల


అడుగంటిన కృష్ణరాజ సాగర్ జలాశయం

● గ్రామాల్లో మొదలైన తాగునీటి కష్టాలు ● బెంగళూరులోనూ హాహాకారాలే ● ఏప్రిల్‌లో మరింత తీవ్రరూపం

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలానికి ముందే రాష్ట్రంలోని జలాశయాలు వెలవెలబోతున్నాయి. కొన్ని జలాశయాలలో నీటిమట్టం అడుగంటిపోతోంది. గత ఏడాదితో పోలిస్తే అన్ని జలాశయాలలోనూ నీటి ప్రమాణం గణనీయంగా తగ్గింది. జలాశయాల పరిధిలోని గ్రామాల ప్రజలకు, పశువులకు తాగునీటికి అప్పుడే కష్టాలు మొదలయ్యాయి. ఇంకా ఎండా కాలం వచ్చేందుకు నెలరోజుల ముందే రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కోసం ప్రజలు తల్లడిల్లే పరిస్థితి మొదలయింది. జనవరి నుంచే ఉత్తరకర్ణాటక జిల్లాల్లో నీటి సమస్యలు తలెత్తాయి. ఇక మార్చి ప్రారంభం నుంచి దాదాపు 25 జిల్లాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది. జిల్లా యంత్రాంగాలు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను సిద్ధం చేసుకోకపోతే పెను ప్రమాదం తప్పదు. బెంగళూరుతోపాటు మైసూరు, మండ్య జిల్లాలకు ప్రధాన తాగునీటి వనరు అయిన కావేరి నదికి అనుబంధంగా ఉండే కేఆర్‌ఎస్, కబిని జలాశయాలలో నీటిమట్టం అడుగంటింది. బెంగళూరు, రామనగర, మండ్య, మైసూరు, చామరాజనగరతోపాటు పలు ప్రాంతాలకు కేఆర్‌ఎస్ జలాశయం నుంచి తాగునీటిని సమకూరుస్తారు. ప్రస్తుతం కేఆర్‌ఎస్‌లో 17 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. అందులో 8.672 టీఎంసీలను మాత్రమే వినియోగించుకునేందుకు వీలుందని కావేరి జలమండలి అధికారులు వెల్లడిస్తున్నారు. హారంగి జలాశయం నుంచి ఒక గ్రామానికి మాత్రమే తాగునీటిని సమకూర్చే వీలుంది. హేమావతి డ్యామ్‌లోనూ నీటి నిల్వలు అడుగంటాయి. అక్కడి నుంచి కేఆర్‌ఎస్‌కు మళ్లించే అవకాశం లేదు. హాసన్‌తోపాటు పలు జిల్లాలకు హేమావతి నుంచే తాగునీటిని సమకూరుస్తారు. ఇప్పటికే హేమావతి పరిధిలో పంటలసాగుకు నీటిని రద్దు చేశారు. కేవలం తాగునీటికి మాత్రమే వినియోగించుకోవాలని అధికారులు ఆదేశించారు. మలెనాడు, తీర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉత్తరకన్నడ జిల్లాలోని నదులు, జలాశయాలు ఎండిపోయాయి. ఈ ప్రభావంతో బోరుబావుల్లో నీరు లభించే పరిస్థితి లేదు. బెళగావి, బాగల్కోటె జిల్లాల పరిధిలోని మలప్రభ, ఘటప్రభ జలాశయాల్లో నీటిమట్టం అడుగంటింది. తుంగభద్ర, ఆల్మట్టి నీరు డెడ్‌స్టోరేజ్‌కు చేరుతోంది. ఈ ప్రభావం బాగల్కోటె, రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాలకు తాగునీటి సమస్యలు ఏర్పడనుంది.

బెంగళూరులో బోరు బావుల లోతు పెంచేందుకు ప్రయత్నాలు

బెంగళూరు నగరానికి పూర్తిగా కావేరి నీరు కీలకంగా ఉంది. శివారు ప్రాంతాల్లో బోరుబావుల ద్వారా నీటిని సమకూరుస్తారు. బోరుబావుల్లో నీటి మట్టం అడుగంటడంతో బోర్లు రీ ఫ్రెష్, లోతు పెంచుకునేందుకు ప్రయత్నాలు జోరందుకున్నాయి. గడిచిన నెల రోజులుగా నగరంలో వేలాది బోర్లు లోతు పెంచే ప్రక్రియ చేసినట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా బోర్లు మరమ్మతుల డ్రిల్లింగ్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. ఒకటికి రెండింతలు ధరలు పెంచినట్టు సమాచారం. నగర శివారు ప్రాంతాల్లోని వైట్‌ఫీల్డ్ సహా మూడు రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నట్టు సమాచారం. ఏప్రిల్‌లో నగర వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా జలాశయాలలో ఫిబ్రవరి నెలలో నీటిమట్టం వివరాలు (టీఎంసీలలో)

జలాశయం	2023	2024
హారంగి	3.29	3.42
హేమావతి	22	14
కేఆర్ఎస్	43.696	17.051
కబిని	13.2	13.2
సూపా	82.22	63.80
తుంగభద్ర	47.128	9.539
ఆల్మట్టి	69.156	51.480
ఘటప్రభ	28.41	33.64
మలప్రభ	15.83	9.51
వాణివిలాస్‌సాగర్	28.415	20.59
భీమా	1.544	0.112
అమర్జా	1.197	0.413
చంద్రంపల్లి	0.262	0.455
గండోరికాలువ	1.375	1.259
ముల్లామారి దిగువ కాలువ	1.306	1.105
ఎగువ కాలువ	0.412	0.362
బెన్నతోర	3.140	3.774
చులకినాలా	0.795	0.791
కారంజ	5.950	5.400
హత్తికుడి	0.1453	0.0994
సౌదాగర్	0.1660	0.1141

రాజ్యసభకు రఘురాం రాజన్ పేరు..?

● పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ



బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ నుంచి అనూహ్యంగా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ పేరు తెరపైకి వచ్చింది. రాజ్యసభ 4 స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాల్లో సులభంగా గెలిచేందుకు అవకాశం ఉంది. అభ్యర్థులు ఎవరనేది ఇంకా రహస్యంగానే ఉంది. రాజ్యసభలో ఒక స్థానానికి ఆర్థికరంగ నిపుణులను పంపాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఆర్‌బీఐ నుంచి పదవీ విరమణ పొందాక కేంద్రప్రభుత్వ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆర్థిక విధానాలపై నిరంతరంగా విమర్శలు చేస్తున్న రాఘురాం రాజన్ ప్రతిపక్షాలకు అభిమాని అయ్యాడు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శలు చేసేవారికి కొదవ లేదు. అయితే ఆర్థికపరమైన వ్యవహారాలలో అపారమైన అనుభవం ఉండి ఆర్‌బీఐ గవర్నర్‌గా మంచి పేరు సంపాదించుకున్న రఘురాం రాజన్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని కాంగ్రెస్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. కర్ణాటక నుంచి సులభతరంగా రాజ్యసభకు పంపవచ్చునని భావించే పేరు ప్రస్తావన తీసుకొచ్చినట్టు సమాచారం.

ఎస్టీ జాబితాలోకి పరివార, తళవార కులాలు

● తక్షణం చేరుస్తున్నాం ● సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైసూరు, చామరాజనగర, కొడగు, హాసన్, మండ్య జిల్లాల్లో పెద్దసంఖ్యలో ఉన్న పరివార, తళవార కులాలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. హరిహరలోని రాజేనహళ్లిలో మహర్షి వాల్మీకి గురుపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వాల్మీకి జాతరను ముఖ్యమంత్రి సిద్దరామయ్య లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ ఈ రెండు కులాలను కేంద్రప్రభుత్వం ఇప్పటికే ఎస్టీ జాబితాలో చేర్చడంతో రాష్ట్రంలోనూ ఇందుకు సంబంధించిన ప్రక్రియ చేపడతామని ప్రకటించారు. సమానసమాజ నిర్మాణంతోనే రామరాజ్య స్థాపన కాగలదన్నారు. సామరస్యం, సహనం అనేది భారతీయ సంస్కృతిలోనే ఉన్నాయని గుర్తు చేసిన ఆయన ఇంత కాలం వంచితులైన ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలకు పాలనలో సముచిత ప్రాధాన్యత కల్పించడాన్ని కొన్ని రాజకీయ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయంటూ ఆయన ఎదురుదాడికి దిగారు. మేధస్సు ఎవరి సొంతం కాదని, మహర్షి వాల్మీకి తన రామాయణ మహాగ్రంథాన్ని రచించడం ద్వారా శ్రీరామచంద్రుడి కాలంలోనే సమసమాజ నిర్మాణానికి పునాదులు వేశారన్నారు. దేశంలో ఇంకా కులవ్యవస్థ, అంటరానితనం కొనసాగుతున్న జాడ్యంపై ముఖ్యమంత్రి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దావణగెరెలో డాక్టర్ పురుషోత్తమానందపురి పట్టాభిషేక రజత మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇదే సందర్భంగా ఉప్పార కులస్థుల భారీ ర్యాలీని ప్రారంభించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను నిలిపే ప్రశ్నే లేదన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే కేంద్రం మెడలు వంచేందుకే ఢిల్లీకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. తమ ఢిల్లీ యాత్రను తప్పుబడుతున్న బీజేపీ నేతలు, ఎంపీలు కేంద్రంపై పోరాడి వీటిని ఎందుకు సాధించలేకపోతున్నారంటూ ప్రశ్నించారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలు తగవన్నారు.


హరిహరలో సమావేశం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం సిద్దరామయ్య తదితరులు

నేడు రాష్ట్రానికి అమిత్‌షా

● మైసూరులో బస ● లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు



బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వస్తున్నారు. శాసనసభ ఎన్నికల వేళ రాష్ట్రంలో ఎక్కువ రోజులు గడిపిన అమిత్‌షా ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా మరోసారి మకాం వేయనున్నారు. శనివారం రాత్రి 10.50 గంటలకు మైసూరులోని మండకళ్లి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ర్యాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్తారు. ఆదివారం ఉదయం 11 గంటలకు చాముండి కొండలపైకి వెళ్లి చాముండేశ్వరి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 11.45 గంటలకు హెలికాప్టర్ ద్వారా సుత్తూరు గ్రామానికి చేరుకుని జాతరలో భాగస్వామ్యులవుతారు. మధ్యాహ్నం భోజనం ముగించుకుని హోటల్‌కు వెనుతిరుగుతారు. ఉదయం, సాయంత్రం పూర్తిగా పార్టీ ముఖ్యనాయకులతో అమిత్‌షా భేటీ కానున్నారు. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు సాగిస్తారు. ఇప్పటికే రాష్ట్ర కోర్ కమిటీ అభ్యర్థుల పేర్లను సిద్ధం చేసింది. వాటిపై నియోజకవర్గాల వారీగా అమిత్ షా సమీక్ష జరపనున్నారు.

అది ఆర్‌ఎస్‌ఎస్ భాష

● బీజేపీ నేత ఈశ్వరప్ప వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం ● 40 శాతం కమీషన్‌పై కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచన

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్షత ఇలాగే కొనసాగితే ప్రత్యేక దక్షిణభారత్ ఆవిష్కరించే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ పెడార్థాలు తీస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య విరుచుకుపడ్డారు. డీకే సురేశ్‌ను కాల్చేయాలంటూ బీజేపీకి చెందిన మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. చంపు, కాల్చు, నరుకు, కొట్టు అనే భాష.. ఆర్ఎస్ఎస్‌లో శిక్షణ పొందినవారిదని... ఇలాంటి భాష మాట్లాడేవారిని రాజకీయ నేతలుగా పిలవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నేతలకు రాజ్యాంగం, చట్టాలపై ఏమాత్రం గౌరవం లేదన్నారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరు మాట్లాడినా ఇదే విధానాన్ని అనుసరిస్తామని పేర్కొన్నారు. అప్పర్ భద్ర పథకానికి రూ.5,300 కోట్లు ప్రకటించిన కేంద్రం ఇంతవరకు ఒక్కపైసా విడుదల చేయలేదన్నారు. రాష్ట్రానికి గ్రాంట్ల మంజూరులో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర పాలకుల దృష్టికి తెచ్చేందుకే ఢిల్లీలో సభ నిర్వహించామని, ఇది ధర్నా కాదన్నారు. కాగా కాంగ్రెస్ హయాంలోనూ 40 శాతం కమీషన్ వ్యవహారంపై కాంట్రాక్టర్ల సంఘం చేసిన ఆరోపణలపై సీఎం స్పందించారు. తగిన ఆధారాలను జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిటీకి సమర్పించాలని సూచించారు.

వీఆర్‌ఎస్‌కు సిద్ధమైన ఐపీఎస్

● ప్రభుత్వానికి ప్రతాప్‌రెడ్డి వినతి ● డీజీపీతో విభేదాలే కారణమా..?


ఐపీఎస్ అధికారి ప్రతాప్‌రెడ్డి

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆంతరంగిక భద్రతా విభాగం డీజీగా వ్యవహరిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి ప్రతాప్‌రెడ్డి స్వచ్ఛంద పదవీ విరమణకు సిద్ధమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఏప్రిల్‌లోగా విరమణ పొందేలా అవకాశం కల్పించాలని వినతి పంపారు. ప్రతాప్‌రెడ్డి మే నెలాఖరుకు పదవీ విరమణ పొందనున్నారు. ప్రస్తుత డీజీపీ అలోక్‌మోహన్‌తో ఇటీవల విభేదాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇద్దరు ఒకే ర్యాంకు కలిగిన అధికారులు కాగా ఇటీవల ప్రతాప్‌రెడ్డికి ఓ మెమో పంపడంతో తీవ్ర విచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకేస్థాయి అధికారి నుంచి మెమో జారీకావడాన్ని ప్రతాప్‌రెడ్డి జీర్ణించుకోలేకనే వీఆర్‌ఎస్‌కు సిద్ధమైనట్లు పోలీసు శాఖ ద్వారా తెలుస్తోంది. ప్రస్తుత నగర పోలీసు కమిషనర్ దయానంద్‌కు ముందు అదే హోదాలో వ్యవహరించారు. సీహెచ్ ప్రతాప్‌రెడ్డి 1964 ఆంధ్రప్రదేశ్ గుంటూరులో జన్మించారు. బీటెక్ చదివిన ఆయన 1991లో కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఉత్తరకర్ణాటక ప్రాంతంలో ఎస్పీగా సీఐడీ విభాగంలో పలు కీలక కేసులు వెలుగులోకి తీసుకువచ్చారు. సీబీఐ అధికారిగా బెంగళూరు, ముంబైలో విధులు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీపీగా పనిచేసిన తర్వాత బెంగళూరు నగర పోలీసు కమిషనర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఆంతరంగిక భద్రతా విభాగం డీజీగా వ్యవహరిస్తున్నారు ప్రతాప్‌రెడ్డి విధినిర్వహణలో రాష్ట్రపతి, ముఖ్యమంత్రి పతకాలను సాధించారు.

సవది తనయుడికి టిక్కెట్..?

● తుమకూరు లోక్‌సభ అభ్యర్థిగా భారతి పేరు

బెంగళూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉండడంతో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అనేలా కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. చిక్కోడ స్థానానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మణ సవది కుమారుడు చిదానంద సవది లేదా ప్రకాశ్ హుక్కేరి కుమారుడు గణేశ్ హుక్కేరిల పేర్లను పరిశీలిస్తున్నారు. సుదీర్ఘకాలంగా బీజేపీలో కొనసాగి గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరిన లక్ష్మణ సవది మరోసారి సొంతగూటికి వెళ్తారనే ప్రచారం ఉంది. మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ ఇదే తరహాలోనే పార్టీ ఫిరాయించడంతో సవదిపైనా నీలినీడలు ఉన్నాయి. దీంతో సవదిని పార్టీలో కొనసాగించాలంటే కుమారుడుకి లోక్‌సభ టిక్కెట్ పేరు ప్రస్తావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక ఎమ్మెల్సీ ప్రకాశ్ హుక్కేరి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని, సీఎం సూచించినా అంగీకరించేది లేదని ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. ఆయన పార్టీకి వ్యతిరేకం కారాదనే కుమారుడు గణేశ్ హుక్కేరి పేరు కూడా తెరపైకి వచ్చింది. ప్రకాశ్ హుక్కేరికి బెళగావి జిల్లాలో సామాజికపరంగానే కాకుండా సేవాగుణంలోనూ మంచి పేరుంది. కొవిడ్ కాలంలో వేలాదిమందికి వైద్యసేవలు అందించారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటారనే పేరుంది.

తుమకూరు అభ్యర్థిగా భారతి

తుమకూరు లోక్‌సభ స్థానానికి కొత్త పేరు తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే ఎస్ఆర్ శ్రీనివాస్ భార్య భారతి అభ్యర్థి కానున్నారనే ప్రచారం సాగుతోంది. ఇటీవలే కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని ఎమ్మెల్యేలకు సూచించినట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శ్రీనివాస్ తుమకూరులో మీడియాతో పంచుకున్నారు. ముద్దహనుమేగౌడకు బదులుగా భారతి అభ్యర్థిని చేయాలని డీకే శివకుమార్ సూచించారన్నారు. అయితే అంతశక్తి లేదని వివరించానన్నారు. కానీ డీకే శివకుమార్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడాలన్నారు. కాగా భారతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ తనకంటే సీనియర్లు పార్టీలో ఉన్నారని, తన పేరు ప్రస్తావించడం సంతోషంగా ఉందన్నారు. తనకు రాజకీయాలంటే ఆసక్తి ఉందన్నారు. మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, జమీర్ అహ్మద్, ఎమ్మెల్యే రంగనాథ్ ఇప్పటికే చర్చలు జరిపారని పేర్కొన్నారు.

ఎన్నికలపై అధిష్టానంతో విజయేంద్ర చర్చలు


జేపీ నడ్డాతో విజయేంద్ర


● ప్రముఖులతో వరుస భేటీలు

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బీవై విజయేంద్ర శుక్రవారం కీలక చర్చలు జరిపారు. సమావేశం అనంతరం ఢిల్లీలో విజయేంద్ర మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర పార్టీలో నేతలందరినీ కలుపుకుని ముందుకు సాగుతున్నానని, దీనిపై అధిష్టానం పెద్దలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సరికొత్త చరిత్ర సృష్టించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్‌తో భేటీ అయ్యానని, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపానని వివరించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని భేటీ అయిన సమయంలో అనుకోకుండా తమ పార్టీ నేతలు బసనగౌడ యత్నాళ్, రమేశ్‌జార్కిహొళి వచ్చారని, ఇది కాకతాళీయమేనని ఇందుకు విపరీత అర్థాలు తీయాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శనివారం రాత్రి మైసూరుకు రానున్నారని, ఆయన ఆధ్వర్యంలో కోర్ కమిటీ కీలక సమావేశం జరుగుతుందన్నారు. ఇందులో నియోజకవర్గాల పంపిణీకి సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. తాను ఎంతో రిస్క్ తీసుకుని బీజేపీలోకి వచ్చానని, తన రాజకీయ ప్రయోజనాలను కాపాడాలని మాజీ మంత్రి సుధాకర్ పేర్కొనడంలో ఎలాంటి తప్పు లేదన్నారు. చిక్కబళ్లాపుర నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారని అయితే అంతిమంగా అధిష్టానందే తుది నిర్ణయమన్నారు. సుధాకర్‌కు టిక్కెట్ ఇవ్వవద్దని తాను ఎక్కడా చెప్పలేదన్నారు. లోకసభ ఎన్నికల అనంతరం రాష్ట్ర రాజకీయాల్లోనూ పెను మార్పులు సంభవించే అవకాశాన్ని తోసిపుచ్చలేమన్నారు. ఢిల్లీలో ధర్నా చేసి రాష్ట్ర ప్రజల పరువు తీశారంటూ ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై విరుచుకుపడ్డారు. కేవలం 9 నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రజావ్యతిరేకత ఎదుర్కొంటోందన్నారు.

ప్రధానితో ఎంపీ సుమలత భేటీ

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ, జేడీఎస్ పార్టీల మధ్య పొత్తు కుదరడం, మండ్య లోక్‌సభ టిక్కెట్‌ను జేడీఎస్ కోరుతున్న నేపథ్యంలోనే ఎంపీ సుమలత శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిశారు. రెండురోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ పరిణామాలను వివరించడంతో పాటు వచ్చే ఎన్నికలలో టిక్కెట్ సాధించుకునే దిశగా ఎంపీ సుమలత హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. మండ్య లోక్‌సభ స్థానాన్ని జేడీఎస్ డిమాండ్ చేస్తోంది. ఇదే స్థానం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా నిఖిల్‌కుమార్ లేదా మాజీమంత్రి తమ్మణ్ణలో ఒకరు పోటీ చేస్తారనే ప్రచారం సాగుతోంది. దీంతో సుమలత ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిశారు. తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అనంతరం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ సంఘటనా కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను ఆమె వేర్వేరుగా కలిశారు. సుమలత తన 'ఎక్స్' ఖాతా ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ బిజీ షెడ్యూల్లోనూ కలిసే అవకాశం ఇచ్చారని, రానున్న కాలంలోను రాష్ట్రం, దేశసేవలో మీతో కలిసి పని చేయాలని ఎదురు చూస్తున్నాను అంటూ రాసుకున్నారు. ప్రస్తుతం మండ్య ఇండిపెండెంట్ ఎంపీగా సుమలత వ్యవహరిస్తున్నారు. గడిచిన శాసనసభ ఎన్నికల వేళ బహిరంగంగా బీజేపీకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీఎస్ పార్టీల సంయుక్త అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ సీఎం కుమారస్వామి తనయుడు నిఖిల్‌ను ఓడించి ఆమె ఎంపీగా విజయం సాధించారు. అప్పట్లో ఆమెపై బీజేపీ అభ్యర్థిని పోటీకి నిలపలేదు.


ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసిన సుమలత



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.06	1,613.71
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	177	9,398
సామర్థ్యం (టీఎంసీలు)	9.48	45.43

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- అసోసియేషన్ సభ్యుడు దేవదాస్ డిమాండ్



కరపత్రాలను విడుదల చేస్తున్న దేవదాస్, శాంత

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9: ఆశ వర్కర్ల జీతాలు ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ ఆశా వర్కర్స్ అసోసియేషన్ సభ్యుడు దేవదాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 13, 14 తేదీల్లో చలో విధానసౌధ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశావర్కర్లకు కనీస వేతనం, గ్రాట్యుటీ, పీఎఫ్‌ఐ, సౌకర్యం కల్పించాలన్నారు. గత రెండేళ్లుగా ఇవ్వని యూనిఫారాలు ఇవ్వాలన్నారు. కనీసం రూ. 2వేలు గౌరవ వేతనం పెంచాలని, మొత్తం నెలకు రూ. 15వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి శాంత మాట్లాడుతూ, రాష్ట్రంలోని 42వేల మంది ఆశావహుల్లో 25నుంచి 30శాతం మందికి అన్యాయం జరుగుతోందన్నారు. చేసిన పనులకు సరైనభృతి అందడం లేదని ఆరోపించారు. 2019-21 కోవిడ్ స్పెషల్ ఇన్సెంటీవ్ మనీ, ఎంసీటీఎస్ యేతర డబ్బు రూ.2వేల మంది ఆశావహులకు చెల్లించాలన్నారు. ఆశా ప్రోగ్రామ్‌లో పనిచేస్తున్న వారికి వారి పోస్టును బట్టి నెలవారీజీతం, ప్రయాణ భత్యం తదితరాలను పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలకు కూడా ఫెసిలిటేటర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సంఘం రామక్క తదితరులు పాల్గొన్నారు.

కురుగోడు తహసీల్దార్‌గా రేణుకమ్మ

కంప్లి, ఫిబ్రవరి 9 : కురుగోడు తహసీల్దార్‌గా రేణుకమ్మ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ వున్న రాఘవేంద్రను ఎన్నికల సందర్భంగా మస్కికి బదిలీ చేయడంతో కూడ్లిగిలో పని చేస్తున్న రేణుకమ్మను కురుగోడుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రాఘవేంద్రరావు ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా రేణుకమ్మ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు తీసుకున్నామని, తమకు ప్రజలు సహకరించాలన్నారు.

వైభవంగా రాజనళ్లి వాల్మీకి రథోత్సవం


రాజనళ్లిలో వాల్మీకి రథోత్సవం

కంప్లి, ఫిబ్రవరి 09 : హరిహర తాలుకా పరిధిలోని రాజనళ్లిలో శుక్రవారం వాల్మీకి పీఠం 6వ వార్షికోత్సవం సందర్భంగా వైభవంగా రథోత్సవం ఊరేగించారు. అలాగే పుణ్యానంద స్వామికి, ప్రథమ వాల్మీకి పీఠాధీశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం పీఠాధీశ్వర ప్రసన్నానంద స్వామి ఆధ్వర్యంలో రథాన్ని ఊరేగించారు. రాష్ట్రంలో పలు గ్రామాల నుంచి వాల్మీకి సమాజంవారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూలు పండ్లతో స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు.

కుక్కను ఢీకొన్న ద్విచక్రవాహనం :వ్యక్తి మృతి

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 09 : అనంతపురం జిల్లా కూడేరు మండలం జల్లిపల్లి గ్రామానికి చెందిన ఖలందర్, షబ్బీర్ పనులపై ద్విచక్రవాహనంపై బళ్లారికి వచ్చి తిరిగి వెళుతుండగా రూపనగుడి, కుంటనహాళ్ మధ్యన రోడ్డులో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. అన్న ఖలందర్‌కు తీవ్ర గాయాలు కాగా, తమ్ముడు షబ్బీర్ (38) అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో ఖలందర్‌ను, మృతి చెందిన షబ్బీర్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. పీడీహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాంగ విలువలపై అవగాహన అవసరం

బళ్లారి కొండపైకి పాదయాత్రలో జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప


బళ్లారి ఏక శిల కొండపై బెలూన్లను ఎగురవేస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి9: రాజ్యాంగం విలువలు, ఆకాంక్షలపై అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలని జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75ఏళ్ళు పూర్తయిన సందర్భంగా శుక్రవారం చారిత్రాత్మక బళ్లారి కొండపైకి చేపట్టిన రాజ్యాంగ పాదయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన మన రాజ్యాంగం మొత్తం ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగమని, ఈ రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ సూత్రాలను పాటించాలంటే ప్రతి ఒక్కరూ రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేరా మాట్లాడుతూ రాజ్యాంగం ఆశయాలను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. రాజ్యాంగంలోని విలువలు, ఆదర్శాలను పాటించాలని ఇందుకు అందరి సహకారం అవసరమన్నారు. అధికారులు, విద్యార్థులు పాదయాత్రగా కొండపైకి చేరుకుని బెలూన్లు విడుదల చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు సతీశ్ రాజ్యాంగ అవగాహనపై గీతాలు ఆలపించారు. రాజ్యాం గ అవగాహనవాక్‌లో భాగంగా కొండ దిగువ భాగంలో అంబేద్కర్ చిత్రం, రాజ్యాంగ పీఠిక, అశోక చక్రం, పార్లమెంట్ హౌస్‌లను రంగోలితో చిత్రీకరించారు. ఈసందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సతీశ్,ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు, జిల్లావెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి జలాలప్ప, సాంఘిక సంక్షేమశాఖ సహాయ సంచాలకులు మమత, జిల్లాస్థాయి అధికారులు వాలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవడం అమానవీయం

సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె ఉద్బోధ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9: బానిసత్వాన్ని ప్రతిబింబించే విధంగా వ్యక్తులను, పిల్లలను పనిలో పెట్టుకోవడం అమానవీయమని, జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు, సీనియర్ సివిల్ జడ్జి రాజేశ్ హొసమనె పేర్కొన్నారు. జిల్లాపాలనాధికారి, జిల్లాపంచాయితీ, కార్మిక శాఖ,


ప్రధాన కూడళ్లలో సాగుతున్న ప్రజాచైతన్య యాత్ర

స్త్రీశిశు సంక్షేమ శాఖ, బాలకార్మికుల కార్యాలయ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక సమస్యల వల్ల కనీస వేతనాలు లేకుండా ఇతరుల చేతుల్లో దళారులుగా పనిచేస్తున్నారని, పాశ్చాత్య దేశాల్లో గతంలో ఈ ఆచారం ఉండేదన్నారు. 1976లో బానిసత్వ నిషేధ చట్టం తీసుకురావడం ద్వారా బానిస వ్యవస్థకు స్వస్తి పలికారన్నారు. దళారులను గుర్తించి వారికి పునరావాసం, ఇతర ప్రభుత్వ సౌకర్యాలు కల్పించి జనజీవన స్రవంతిలోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ విధానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి ఏడాది ఫిబ్రవరి 9న కులవృత్తుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ జుబేరా అధ్యక్షత వహించి మాట్లాడుతూ, సమాజంలో అత్యంత అన్యాయమైన వ్యవస్థ బానిసత్వ వ్యవస్థ అని అన్నారు. రాజ్యాంగం మనకు సమానత్వం స్వేచ్ఛతో జీవించడానికి అన్ని హక్కులను ఇచ్చిందన్నారు. ఇతరులను దోపిడీ చేస్తూ జీవించే అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లాల వారీగా ఉపాధిహామి కూలీల సమాచారంతో కూడిన నివేదికను విడుదల చేశారు. జీతపద్ధతి నిర్మూలన దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లాకలెక్టర్ కార్యాలయం అవరణ నుంచి చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను జిల్లా లీగల్ సర్వీసెస్ జడ్జి హొసమనె, జిల్లాసహాయ కలెక్టర్ మహమ్మద్ జుబేరా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ప్రారంభించారు. ఈ పాదయాత్ర గడిగిచెన్నప్ప సర్కిల్ మీదుగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణకు చేరుకుంది. వందలాది మంది విద్యార్థులు జాతాలో పాల్గొని కుల వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా లేబర్ ఇన్‌స్పెక్టర్ రవిదాస్, చైల్డ్ లేబర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మౌనేశ్, జిల్లాకమిషనర్ కార్యాలయ అధికారులు, ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.55 కోట్ల మిగులుతో కుడితిని బడ్జెట్


కుడితిని పట్టణ పంచాయతీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 9 : 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ. 2.55 కోట్ల మిగులుతో శుక్రవారం కుడితిని నగరపంచాయతీలో బడ్జెట్ ప్రతిపాదించారు. నగర పంచాయతీలో శుక్రవారం తహసీల్దార్ గురురాజు ఆధ్వర్యంలో బడ్జెట్ సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఆదాయవ్యయాలను సిబ్బంది చదివి వినిపించారు. అనంతరం 15వ వార్డులోని ఇందిరానగర్‌లో సామూహిక శౌచాలయాల్లో విద్యుత్ సమస్యపై చర్చించారు. అలాగే ట్యాక్స్ విషయంలో, వివిధ అంశాలపైన హాలప్ప, సునిల్ కుమార్, దుగ్గప్ప, మంజునాథ, రామలింగప్ప, వెంకటరమణ బాబులు చర్చించారు. ఈ విషయాలను జిల్లా అధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఈ సందర్భంగా కుడితిని పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ, కుడితిని పరిధిలో ఎలాంటి నిబంధనలను పాటించకుండా కర్మాగారాలు నడుపుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సహ జిందాల్ యాజమాన్యం కూడా ఎలాంటి గ్రామ పంచాయతీ నీటి పారుదల అధికారుల పర్మిషన్ లేకుండా దరోజీ, తిమ్మలాపురం వద్ద బోర్లు ఏర్పాటు చేసుకుని నీటిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కర్మాగారాలకు ఎలాంటి పర్మిషన్ లేకుండా నీటిని మళ్లిస్తున్నా జిల్లా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కనికేరి పంపాపతి, లెనిన్, రామలింగప్ప, మంజునాథ్, ముఖ్య అదికారి తీర్థ ప్రసాద్, ఇంజనీర్ శారద తదితరులు పాల్గొన్నారు.

దరోజీ వద్ద రైల్వే ట్రాక్‌ను పరిశీలించిన డీఆర్ఎం

కంప్లి, ఫిబ్రవరి 09 : జేఎస్‌డబ్ల్యూ కర్మాగారాలకు, తోరణగల్లు సండూరుకు మధ్య దరోజీ వద్ద శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్‌ను రైల్వే శాఖ డీఆర్ఎం హర్షకారే పరిశీలించారు. ఇక్కడ డీఎంఎఫ్ నిధులతో రోడ్డును నిర్మించారు. కానీ రైల్వే ట్రాక్ రోడ్డుకు అడ్డుగా వుండటంతో, రోడ్డు పనులను నిలిపివేశారు. దీంతో ఆ రోడ్డు ట్రాక్‌పైనుంచి వెళ్లేందుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే తుకారామ్, మంత్రి సంతోష్ లాడ్ హుబ్లి డివిజన్ రైల్వే అధికారులకు మనవిపత్రం ఇచ్చారు. గతంలో ఈ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై గేటు వుండేది. ఇక్కడి నుంచే తోరణగల్లు చేరుకునేవారు. కొన్ని కారణాల వల్ల దీనిని బంద్ చేశారు. కనుక జిందాల్ సిబ్బందిని, రైతులను గంగావతి, కంప్లి, కురుగోడు భాగాల నుంచి వచ్చే ప్రజలను దృష్టిలో వుంచుకుని ఈ ట్రాక్‌పై రోడ్డు ఏర్పాటుకు అవకాశం కల్పిస్తే అందరికి అనుకూలంగా ఉంటుందని ప్రజలు తెలిపారు. అనంతరం హర్షకారే మాట్లాడుతూ జిల్లా అధికారులతో చర్చించి పరిశీలించిన అనంతరమే తమకు నిర్ణయం తెలియజేస్తామని తెలిపారు. వారితో పాటు రైల్వే శాఖ అధికారి వర్మ, జనార్దన్, గురుమూర్తి, నారాయణ, రవి, రమేష్, కాళప్ప, యర్రిస్వామి, మాయన్న, గణేష్, తిమ్మరాజు, దస్తగిరి, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ట్రాక్‌పై రోడ్డు పనుల విషయంపై చర్చిస్తున్న దరోజీ ప్రముఖులు

ఘనంగా బన్ని మహంకాళి దేవి రథోత్సవం


మహా రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 9 : తాలుకాలోని ప్రసిద్ధి చెందిన బలకుందిలో శుక్రవారం అంగరంగ వైభవంగా శ్రీబన్ని మహంకాళి దేవి జాతర మహారథోత్సవం జరిగింది. ఈ నేపథ్యంలో మహంకాళి దేవికి అర్చకులు పూలమాలలతో అలంకారం చేశారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కుబడులు తీర్చుకున్నారు. శనివారం కుంభ మహోత్సవం జరుగనుంది.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 9 : నగరంలో శుక్రవారం చొల్లంగి అమావాస్య సందర్భంగా బళ్లారి దుర్గమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని భక్తాదులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా అమావాస్య సందర్భంగా ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని చేళగుర్కి యర్రితాత ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మల్లికార్జున స్వామి


మల్లికార్జునస్వామిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఫిబ్రవరి 9 : సిరుగుప్ప తాలుకా బీజేపీ మండల అధ్యక్షులుగా కుంటనహాళ్ మల్లికార్జున స్వామి ఎన్నికయ్యారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆయనకు పూలమాలవేసి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషిచేస్తానని, అభివృద్ధి బాటలో తీసుకువస్తానని తెలిపారు.

ఇండో అమెరికన్ కళాశాల విద్యార్థినులకు వర్సిటీ ర్యాంకులు


నుజాహత్ హఫ్శా


ఖాజాబన్ని


కావ్య

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 9: విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 2022-23 సంవత్సరానికిగాను అండర్ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ర్యాంకులను ప్రకటించారు. నగరంలోని ఇండో అమెరికన్ కళాశాలలో చదువుతున్న నుజాహత్ హఫ్శా బీబీఏ విభాగంలో 3వ ర్యాంకును, ఖాజాబన్ని బీకాంలో 5వ ర్యాంకును, కుమారి కావ్య బీకాంలో 7వర్యాంకును సంపాదించి కాలేజీకి కీర్తిని తీసుకొచ్చారని కాలేజీ పాలక మండలి చైర్మన్ పి.నాయుడు తెలిపారు. ప్రిన్సిపాల్ షేక్ సలీంభాష, సుధీర్‌కుమార్, రాజేశ్, ఉదయ్ భాస్కర్, ర్యాంకు సంపాదించిన విద్యార్థినులను అభినందించారు.

ప్రతిభను వెలికితీయడానికే ప్రతిభా కారంజి పోటీలు


విద్యార్థులకు ప్రతిభా కారంజి పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, ఫిబ్రవరి 9 : విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభను వెలికితీయడమే ప్రతిభా కారంజి ముఖ్య ఉద్దేశమని ఎస్ఈఎస్ ఆంగ్ల పాఠశాల ముఖ్య ఉపాధ్యాయురాలు లిల్లీ థామస్ తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో ప్రతిభా కారంజి కార్యక్రమాన్ని చేపట్టారు. పిల్లలు, విద్యార్థులకు సాంస్కృతిక నృత్య ప్రదర్శన, వస్తువుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య ఉపాధ్యాయులు లిల్లీ థామస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బానిస పద్ధతి సరైంది కాదు

సిరుగుప్ప, ఫిబ్రవరి 9 : జీతానికి జీవితకాలం పనిచేసే బానిస పద్ధతి మనిషికి సరైంది కాదని తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్ దండప్ప అన్నారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో తాలుకా పంచాయతీ భవనంలో జిల్లా పంచాయతీ, తాలుకా పంచాయతీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జీతదాళ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం ఈ పద్ధతిని రద్దు చేసినట్లు తెలిపారు. మనిషికి రోజూ ఎనిమిది గంటలు మాత్రం విధులు నిర్వహించేందుకు ఆస్కారం వుంటుందని తెలిపారు.

హోసూరు జోన్

వార్షికోత్సవాలతో విద్యార్థులకు ప్రోత్సాహం


అందివాడి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు

హోసూరు ఫిబ్రవరి 9 : తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్టాలిన్ ఆదేశానుసారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామని హోసూరు ఎమ్మెల్యే వైప్రకాశ్ అన్నారు. గతంలో ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే వార్షికోత్సవాలు జరిగేవన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలు జరిపితే అది విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. హోసూరు సమీపంలోని అందివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం జరిగింది. ఇక్కడ 315 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నీరప్ప అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయురాలు ఉషా అందరికి స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయులు రాణి వార్షిక నివేదికను చదివారు. కార్యక్రమంలో మేయర్ సత్య, హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్, కౌన్సిలర్లు భాగ్యలక్ష్మి, డివిజన్ కార్యదర్శి తిమ్మరాజ్, నగర ఉప కార్యదర్శి గోపాలకృష్ణలు పాల్గొని, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కూలీలు లేని రాష్ట్రంగా తమిళనాడు: అధికారుల ప్రతిజ్ఞ

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 9: బానిస కూలీల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని, శుక్రవారం ప్రభుత్వ అధికారులందరి చేత జిల్లా కలెక్టర్ సరయు ప్రతిజ్ఞ చేయించారు. 1976 నుంచి అమలు ల్లోకి వచ్చిన చట్టం ద్వారా బలవంతపు శ్రమ అనేది ఒక రకమైన బానిసత్వం అన్నారు. ప్రీ -పెయిడ్ లోన్‌ల ద్వారా ఒక వ్యక్తిని బలవంతపు శ్రమకు గురిచేయడం లేదా కొన్ని ఇతర కుల, సామాజిక పరిమితి ద్వారా పని చేయడానికి వారిని పరిమితం చేస్తే చట్టం ప్రకారం మూడు సంవత్సరాలు వరకు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానం కూడా విధిస్తారన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 9 : కృష్ణగిరి జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పర్యావరణానికి కాలుష్యం కలిగించని పసుపు సంచుల వినియోగాన్ని అమలు పరిచి, అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి తరపున కృష్ణగిరి జిల్లాలోని పది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధంపై అవగాహన కల్పించేందుకు వక్తృత్వ పోటీలు, పెయింటింగ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలి తరపున 27 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతేకాకుండా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.20.250 విలువైన బహుమతులు, షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్వ్యూ అసిస్టెంట్ పుష్ప, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రంగరాజ్, అసిస్టెంట్ ఇంజనీర్లు వినోదిని, గణేశన్, నీలమేగం, పర్యావరణం అధికారి తీర్థగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరూ సహకరించాలి


ప్రసంగిస్తున్న న్యాయధికారి దయానంద బేలూరు

రాయచూరు, ఫిబ్రవరి 9: వెట్టి చాకిరి నిర్మూలనలో ప్రభుత్వ అధికారులకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని జిల్లా ఫస్ట్‌గ్రేడ్ న్యాయాధికారి దయానంద బేలూరు అన్నారు. శుక్రవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా న్యాయసేవా ప్రాధికార సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవానికి సంబంధించి ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ, 1976లో వెట్టిచాకిరి నిర్మూలన చట్టం వచ్చినా, ఇప్పటి వరకు కొన్నిచోట్ల కొనసాగుతుండడం ఆందోళనకరమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఈ విధానాన్ని ప్రతిఒక్కరు వ్యతిరేకించాలన్నారు. ఈ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకునే క్రమంలో అధికారులకు ప్రభుత్వానికి అందరి సహకారం అవసరమన్నారు.

ప్రేమ వైఫల్యంతో బాలిక ఆత్మహత్య


సంగీత(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 9 : తన ప్రేమను పెద్దలు నిరాకరించారన్న కారణంగా ఓ బాలిక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున జిల్లాలోని మాన్వి పట్టణంలో చోటుచేసుకుంది. మాన్వి పట్టణానికి చెందిన 17 ఏళ్ల యువతి సంగీత, కృష్ణ అనే కారు డ్రైవర్‌ను ప్రేమించగా ఆమె ప్రేమను పెద్దలు తిరస్కరించారు. తన ప్రియుడు కృష్ణతో కలిసి ఇప్పటికే రెండు సార్లు ఇళ్లు విడిచి వెళ్లిన సంగీతను పెద్దలు నచ్చజెప్పి వెనక్కి తీసుకొచ్చారు. తాను అతనితోనే ఉంటానని అతన్ని వివాహం చేసుకుంటానని మొండి పట్టుదల పట్టడంతో పెద్దలు తిరస్కరించారు. దీంతో మనస్తాపానికి గురైన సంగీత ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాన్వి పోలీసులు సంఘటన కేసు నమోదు చేశారు.

ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించండి


చింతామణి, ఫిబ్రవరి 9: పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో కొన్ని చోట్ల చెట్లకొమ్మలు కిందికి వంగి ఉండి వాహన సంచారానికి అంతరాయం కలిగిస్తున్నాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని పలువురు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రత్యేకించి అంజని లే అవుట్ మెయిన్ రోడ్డులో వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ కార్యాలయం సమీపాన ఒక చెట్టు చాలా కిందకు వంగి ఉంది. దీంతో ఇప్పటికే పలు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. డబుల్‌రోడ్డులోని రెడ్డి మిలిటరీ హోటల్ నుంచి అంజని లే అవుట్‌లోని నగరసభ ఫిల్టర్‌బెడ్ సర్కిల్ మీదుగా ఆశ్రయ లే అవుట్‌కు వెళ్లే రోడ్డు, ట్యాంక్‌బండ్ రోడ్డు, టీచర్స్ కాలనీ, అశ్విని లే అవుట్ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులు ఉన్నాయి. ప్రభుత్వ హైస్కూల్, రాయల్ ప్రాథమిక, హైస్కూల్, డిగ్రీ కాలేజ్, చేతన్ స్కూల్, లిటిల్‌లార్డ్ స్కూల్, బాలుర, బాలికల హాస్టళ్లు, సబ్‌జైల్, జిల్లా పంచాయతీ కార్యాలయం తదితర కార్యాలయాలకు, కాడు మల్లేశ్వర కొండకు వెళ్లే ప్రధాన రహదారి కూడా ఇదే. ఈ నేపథ్యంలో నిత్య ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలతోపాటు ఇతరత్రా వాహ నాల సంచారం అధికంగా ఉంది. కాగా దుస్థితిలో ఉన్న రోడ్లను నగరసభ ప్రత్యేక గ్రాంట్లతో ఇటీవల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో వాహనరద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదాలను ఆహ్వానించేలా ఉండే చెట్ల కొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు. కాగా ప్రత్యేకించి వ్యవసాయశాఖ కార్యాలయం సమీపాన ఉండే చెట్టు కొమ్మను తొలగించేలా లిఖిత పూర్వకంగా అటవీశాఖకు ఇప్పటికే కోరామని నగరసభ కమిషనర్ జీఎస్ చలపతి వెల్లడించారు. సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.


అంజని లే అవుట్ మెయిన్‌రోడ్డులో వంగి ఉన్న చెట్టుకొమ్మ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ఎస్ రాజం (జయంతి)



సంగీత కళా శిఖామణి సుందరం రాజం 1919 ఫిబ్రవరి 10న మదురైలో జన్మించారు. తమిళనాడుకు చెందిన ఆయన కర్ణాటక సంగీతం లోనూ, చిత్ర లేఖనంలోనూ పేరొందారు. ప్రముఖ సంగీత స్వరకర్త పాపనాశం శివన్ శిష్యులలో ఆయన ఒకరు. 1934లో తమిళంలో 'సీతా కల్యాణం' సినిమా రూపొందించారు. పూర్తిస్థాయి సంగీత దర్శకుడు కాక మునుపు కొన్ని సినిమాల్లో నటించారు. ఆలిండియా రేడియోలో సంగీత కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆయన గీసిన సంగీత త్రిమూర్తుల తైలవర్ణ చిత్రాలు ఎంతో పేరొందాయి. కర్ణాటక గాత్ర సంగీతంలో సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా శిరోమణి బిరుదు ఇతరత్రా గౌరవాలు పొందారు. 2010 జనవరి 29న కన్నుమూశారు.

భర్తను వదిలి మరో వివాహితుడితో పరారీ..

▸▸ అతడి ఇంటిని ధ్వంసం చేసిన మహిళ బంధువులు

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భర్తను వదిలి ఓ వివాహితుడితో పరారైన సంఘటన వివాదానికి కారణమైంది. బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా జీనరాళ గ్రామానికి చెందిన ఓ మహిళ అదే గ్రామానికి చెందిన లగమ వాలీకర్ అనే వ్యక్తితో కొంతకాలంగా స్నేహం, ఆ తర్వాత ప్రేమ, వివాహేతర సంబంధానికి కారణమైంది. మహిళ, లగమ వాలీకర్‌లు రెండు రోజులక్రితం పరారీ అయ్యారు. మహిళ ఇల్లు విడిచి వెళ్లేందుకు లగమ వాలీకర్ కారణమని భావించిన ఆమె బంధువులు, లగమ ఇంటిని ధ్వంసం చేశారు. ఇంటి తలుపులు బద్దలుకొట్టి అద్దాలను ధ్వంసం చేసి ఇంట్లో సామగ్రిని బయట పడేశారు. స్థానికులు కొందరు జిల్లా ఎస్పీ డాక్టర్ భీమాశంకర్ గుళేద్‌కు సమాచారం అందించారు. వెంటనే యమకనమరడి పోలీసులను అప్రమత్తం చేసి ఆస్తులను కాపాడగలిగారు. పరారైన వారి కోసం గాలింపులు చేపట్టారు.

మైక్రో ఆర్ట్స్‌కు ముగ్ధుడైన ఎమ్మెల్యే


మైక్రో ఆర్ట్స్ గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న కళాకారుడు అప్పారావు

హొస్పేట, ఫిబ్రవరి 9: బియ్యం గింజపైనో ఆవాల గింజపైనో అద్భుతమైన కళాఖండాలను సృష్టించడం ఆషామాషీ కాదు. అదొక గొప్పకళ. మైక్రో ఆర్ట్స్ సృష్టికర్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గేదెల అప్పారావు శుక్రవారం హొస్పేట శాసనసభా నియోజకవర్గం పరిధిలోని కొరలూరు రైల్వేగేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనకు స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ ఫిదా అయ్యారు. ఈ కళగురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని కళాఖండాలను వీక్షించి ముగ్ధులయ్యారు. కొరలూరు రైల్వే గేట్ వద్ద వంతెన శంకుస్థాపన కార్యక్ర మానికి ఆయన ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇదే ప్రాంగణంలో ప్రవాసాంధ్రుడైన గేదెల అప్పారావు మైక్రో ఆర్ట్స్‌ను ఆసక్తిగా తలకించారు.

ఘనంగా నందీశ్వర ఆలయ వార్షికోత్సవం


నందీశ్వరుడికి విశేష పూజలు

మహదేవపుర, ఫిబ్రవరి 9: నియోజకవర్గంలోని హరాడి గ్రామంలో కొలువైన నందీశ్వర దేవాలయ 6వ వార్షికోత్సవం పురస్కరించుకుని విశేషపూజలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణ, పూజ, గణపతి హోమం, కుంభాభిషేకం ఇతర పూజా కైంకర్యాలు సా గాయి. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్న దాసోహం నిర్వహించారు. ఉత్సవాల్లో మాజీ మంత్రి అరవింద లింబావళి పాల్గొని స్వామి వారిని దర్శిం చుకున్నారు. అనంతరం మాజీ మంత్రిని ఆలయ అర్చ కులు తీర ప్రసాదాలు పంపిణీ చేసి సంప్రదాయంగా సత్కరించారు. తొలుత నందీశ్వరుడికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయవార్షికోత్సం సంద ర్భంగా విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. ఉత్సవాలను ఆలయ ధర్మకర్త వెంకటేశ్ రెడ్డి పర్య వేక్షించగా గ్రామ ప్రముఖులు హరాడి పిళ్లప్ప, అనూప్ రెడ్డి, ప్రకాశ్ బాబు, మహేంద్ర, నరేంద్రబాబు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని వదిలివెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

పావగడ, ఫిబ్రవరి 9: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఒకటిన్నర సంవత్సరాల బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి వదిలి వెళ్లినట్లు టీహెచ్ఓ తిరుపతయ్య తెలిపారు. బాలుడిని స్వాధీనం చేసుకొన్న వైద్యాధికారులు అన్ని పరీక్షలు చేసిన అనంతరం బాలుడికి పుట్టుకతోనే వెన్నెముక దెబ్బతినడంతో పెద్దయ్యాక కూడా నడిచే పరిస్థితి లేనందువల్ల తల్లిదండ్రులు వదిలి వెళ్లి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం తుమకూరు పిల్లల సాంత్వన కేంద్రానికి బాలుడిని తరలించినట్లు తిరుపతయ్య తెలిపారు. బాలుడిది సమీపంలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రొద్దం, లేక పెనుకొండ ప్రాంతానికి చెందిన వ్యక్తులు వదిలి వెళ్లి ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌ను విమర్శించే నైతికత ఎంపీకి లేదు


మీడియాతో కాంగ్రెస్ ప్రతినిధి స్టాన్‌లి తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయంగా ఎదిగిన ఎంపీ మునిస్వామికి పార్టీని విమర్శించే నైతికత లేదని రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధి స్టాన్‌లి మండిపడ్డారు. పట్టణంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సభ్యుడిగా, కాంగ్రెస్ ఎస్సీ విభాగం కేపీసీసీ సభ్యుడిగా ఎదిగిన మునిస్వామి మారిన రాజకీయాలతో బీజేపీలో చేరి ఎంపీ అయ్యారన్నారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో కొనసాగి రాజకీయంగా ఎదిగారన్నారు. ఎంపీ మునిస్వామి తన ఐదేళ్ల అవధిలో పార్లమెంట్‌లో కేవలం అరగంట కూడా మాట్లాడలేదని, జిల్లా అభివృద్ధి గురించి ఎటువంటి ప్రస్తావన తేలేదన్నారు. జీరో అవర్‌కు, ప్రశ్నోత్తరవేళకు ఆయన అవగాహన లేదని ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చలో అనవసరమైన చర్చ ద్వారా సమయాన్ని వృథా చేశారన్నారు. ఇందుకు సంబంధించి సభాధ్యక్షులు ఇది ప్రశ్నోత్తరవేళ అని సూచించినా ఎంపీ మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారన్నారు. కేహెచ్ మునియప్ప సాధనలను తన సాధనలుగా గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. విశ్వప్రసిద్ధమైన కేజీఎఫ్‌లోని బంగారు గనులను పునఃప్రారంభించకుండా ప్రజల జీవితాలతో ఆట్లాడుకుంటున్నారని ఆరోపించారు. స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ కనీసం ఐదు గ్రామాలను దత్తత తీసుకుని ఆదర్శంగా తీర్చాలని సూచించినా మునిస్వామి స్పందించలేదని ఆరోపించారు. కాగా ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం ద్వారా అశాంతికి కారణమవుతున్నారన్నారు. ఇందుకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన బదులిస్తారన్నారు. మీడియా సమావేశంలో నగర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు, పార్థసారథి, ప్రముఖులు మహదేవప్ప, సుహేల్, శ్రీనివాస్, రఘునాథ్, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ నేత్రాల సంరక్షణపై ప్రత్యేక అవగాహన


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న నారాయణ నేత్రాలయ వైద్యుల బృందం

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సీజన్ రానుండటంతో విద్యార్థులకు నేత్రాల సంరక్షణపై నగరంలోని నారాయణ నేత్రాలయ ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నారాయణ నేత్రాలయ ఛైర్మన్ డాక్టర్ రోహిత్ శెట్టి, వైస్‌ఛైర్మన్ డా.నరేన్ శెట్టి, నేత్ర వైద్య నిపుణులు డా.జ్యోతి మటాలియా, డా.సుమితా ముత్తు నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పరీక్షల సమయంలో నేత్రాలపై వత్తిడి అధికం కావడం వల్ల సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థి సహజంగా రోజుకు 10-14 గంటల పాటు చదవడమో రాయడమో చేస్తాడని పరీక్షల సమయంలో ఇది 16 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్షలకోసం ప్రిపేర్ కావడం మంచిదేనని అయితే ఇదే సమయంలో కొన్ని కనీస జాగ్రత్తలు పాటిస్తే నేత్ర సమస్యల నుండి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రత్యేకించి పుస్తకాన్ని 14-16 ఇంచ్‌ల దూరం నుండి చదవాలని, మొబైల్ ఫోన్‌లలో పాఠ్యాంశాలు ఎక్కువ సేపు చదవడం మంచిది కాదని చదివే క్రమంలో కనీసం 20 నిముషాల బ్రేక్ తీసుకోవడం మంచిది ఈ సమయంలో మళ్లీ టీవీలు, మొబైల్స్ చూడకుండా కళ్ళు మూసుకుని ప్రశాంతంగా ఉండటం లేదా యోగా వంటివి చేయాలని ఆరోగ్య పరంగా డైట్‌తో పాటు తగిన సమయం నిద్రపోవడం వల్ల ఎలాంటి సమస్యలు రావని పేర్కొన్నారు. ఈ అంశాలపై నారాయణ నేత్రాలయ విద్యార్థుల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు.

త్వరలో కాంగ్రెలోకి జేడీఎస్ ఎమ్మెల్యేలు

▸▸ ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్


మీడియాతో ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్

బెంగళూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కోలార్ జిల్లాకు చెందిన జేడీఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ముళబాగిలు సమృద్ధి మంజునాథ్, శ్రీనివాసపుర జీకే వెంకటశివారెడ్డిలు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారని ఎమ్మెల్యే కొత్తనూరు మంజునాథ్ వెల్లడించారు. శుక్రవారం కోలార్‌లో ఎమ్మెల్యే మంజునాథ్ మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే సీఎం సిద్దరామయ్య, కాంగ్రెస్ అధ్యక్షులు డీకే శివకుమార్‌లతో ఒక విడత చర్చలు జరిగాయన్నారు. ఇరువురు పార్టీలో చేరే విషయమై జిల్లాకు చెందిన సీనియర్‌నేత రమేష్‌కుమార్ అభిప్రాయాన్ని కూడా డీసీఎం డీకే శివకుమార్ తీసుకున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందే వారు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. జేడీఎస్ పార్టీ సభ్యత్వంతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీ నామా చేస్తారన్నారు. శ్రీనివాసపుర నుంచి ఉప ఎన్నికలలో వెంకటశివారెడ్డిని మాజీ స్పీకర్ రమేష్‌కుమార్ ప్రతిపాదిస్తారని ముళబాగిలులో సమృద్ధి మంజునాథ్‌కు స్వయంగా తానే ప్రతిపాదిస్తానని తెలిపారు. కాగా ఎమ్మెల్సీ అనిల్ కుమార్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే జరిగితే కోలార్ జిల్లాలో జేడీఎస్‌కు కోలుకోలేని నష్టం వాటిల్లనుంది. ప్రస్తుతం శాసనసభలో జేడీఎస్‌కు 19మంది సభ్యులు ఉండగా వారి బలం 17కు తగ్గే అవకాశాలు ఉన్నాయి.

కార్-టి సెల్ థెరపీ విజయవంతం


వైద్య బృందం

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కార్-టి సెల్ థెరపి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసిన తొలి ప్రైవేట్ ఆసుపత్రిగా అపోలో కేన్సర్ సెంటర్ అరుదైన ఖ్యాతిని సాధించింది. కార్-టి సెల్ థెరపీని వైద్యపరిభాషలో జీవంత ఔషధాలుగా పిలుస్తారు. అఫెరెసిస్ అనే ప్రక్రియ ద్వారా కేన్సర్‌పై పోరాడే ఈ తెల్ల రక్తకణాలు చికిత్సలో అత్యంత కీలకమైనవని అపోలో అసుపత్రి గ్రూప్ అంకాలజీ ఇంటర్నేషనల్ ఛైర్మన్ దినేష్ మాధవన్, కర్ణాటక జోన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్న డా.మనీష్ మట్టూ పేర్కొన్నారు. ఈ వైద్య ప్రక్రియ విజయవంతం కావడంతో నగరంలో గురువారం వీరు మీడియాతో మాట్లాడారు. దేశంలోనే ఈ ప్రయోగం తొలిది కావడం ఇంకా సంతోషంగా ఉందన్నారు. కేన్సర్‌వ్యాధి ఇకపై ఏ మాత్రం ప్రాణాంతకం కాదని తగిన సమయంలో గుర్తించగలిగితే నియంత్రణ పూర్తిగా సాధ్యమేనని ఈ ప్రయోగం నిరూపించిందన్నారు. మీడియా సమావేశంలో వైద్యనిపుణుడు ప్రముఖ హెమటో అంకాలజిస్టు డా.ఆదిత్య మురళి మాట్లాడుతూ కార్-టి సెల్స్‌ను వినియోగించి ముగ్గురు కేన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్సలు చేయడం జరిగిందన్నారు. వైద్యచరిత్రలో ఇదొక మైలురాయి కానుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 147 దేశాలకు చెందిన వారు కేన్సర్ చికిత్సల కోసం భారత్‌కు వస్తున్నారని చెప్పారు. కార్-టి సెల్ ప్రయోగం ప్రక్రియ, పనిచేసే విధానం గురించి మీడియా సమావేశంలో ప్రత్యేకంగా వివరించారు.

గ్రాంట్ల విడుదలలో తారతమ్యం ఎందుకు..?

బాగేపల్లి, ఫిబ్రవరి 9: రాష్ట్రాలనుంచి పన్నులరూపంలో భారీగా పొందుతున్న కేంద్ర ప్రభుత్వం అదేరీతిన గ్రాంట్లను కూడా మంజూరు చేయాలని, తారతమ్యం తగదని సీపీఎం పేర్కొంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రశాంత్ పాటిల్‌కు వినతిపత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి కరువు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పథకాల అమలులో ఎన్డీయే ప్రభుత్వం జోక్యం చేసుకుని రాష్ట్రాలను ఇబ్బంది కలిగించరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇష్టం వచ్చినట్టు రుణాలు చేయడాన్ని అడ్డుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకుని పన్ను విభాగాలను దుర్వినియోగం చేయరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల అంశాలలో గవర్నర్ జోక్యం లేదా రాజ్యాంగబద్ధమైన స్థానాలను దుర్వినియోగం చేయరాదన్నారు. నిరసనలో సీపీఎం ప్రముఖులు రఘురామరెడ్డి, వాల్మీకి అశ్వథప్ప, కృష్ణప్ప, ఓబళ రాజు, గూళూరు కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నిరసన

ఔషధాల వాడకంపై జాగృతి




జాగృతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను కాపాడాల్సిన మందులే ఒక్కోసారి తగిన అవగాహన లేకపోవడంతో సమస్యాత్మకంగా పరిణమిస్తున్నాయి. ఈ అంశంపై ప్రజలను జాగృత పరిచేందుకు మేయర్ ఆర్గానిక్స్ లిమిటెడ్, 92.7 బిగ్ ఎఫ్ఎం, కర్ణాటక డ్రగ్స్ ఫార్మాస్యూటికల్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్, రాష్ట్ర ఆరోగ్యశాఖల సహకారంతో ప్రిస్క్రిప్షన్ ఫర్ చేంజ్ పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వర్చువల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు శుక్రవారం ప్రారంభించారు. గడువు ముగిసిన మందులను శాస్త్రీయ పద్ధతుల్లో సంస్కరించేందుకు వీలుగా ప్రజల్లో అవగాహన కల్పించడం చాలా అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మేయర్ ఆర్గానిక్స్ సంస్థ చక్కటి కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రశంసించారు. బిగ్ ఎఫ్ఎం సీఓఓ సునిల్ కుమారన్, మేయర్ ఆర్గానిక్స్ డైరెక్టర్ ఉమా కాలేకర్, కర్ణాటక డ్రగ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్ పత్రీచా తదితరులు ఈ సందర్భంగా పాల్గొన్నారు.

రాజ్యాంగ రథయాత్రకు ఘన స్వాగతం

చేళూరు, ఫిబ్రవరి 9: తాలూకాలోని రాచెరువు గ్రామపంచాయతీలో శుక్రవారం రాజ్యాంగ జాగృతి రథానికి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. బిళ్యారు నుంచి వచ్చిన రథానికి గ్రామపంచాయతీ సభ్యులు ఆత్మీయంగా స్వాగతించారు. రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించే రథ యాత్ర పలు ప్రాంతాలలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం రాచెరువు గ్రామానికి చేరుకుంది. గ్రామపంచాయతీ మాజీ ఉపాధ్యక్షుడు భానుస్వామి ప్రసంగిస్తూ రాజ్యాంగం గురించిన ఆశయాలు, హక్కులను వివరించారు. సభ్యుడు సలీమా అంబేడ్కర్ కూడా ప్రసంగించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



రాచెరువు గ్రామంలో రాజ్యాంగ రథయాత్ర

యూనివర్సల్ స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో నేడు సదస్సు

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ మూల సిద్ధాంతాలకు సంబంధించి చారిత్రాత్మక తీర్పు వెలువడి 50 సంవత్సరాలైన సందర్భంగా రామోహళ్ళిలోని యూనివర్సల్ స్కూల్ ఆఫ్ లాలో ప్రత్యేక సదస్సు ఏర్పాటవుతోంది. కబ్బన్‌పార్కులోని ఎన్‌జీఓ హాల్‌లో శనివారం ఉదయం జరిగే ఈ సదస్సుకు ఎడనీరు మఠానికి చెందిన సచ్చిదానంద భారతి స్వామిజీ సారథ్యం వహిస్తారు. లోకాయుక్త మాజీ న్యాయమూర్తి సంతోష్ హెగ్డే ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. యూనివర్సల్ సంస్థ ఛైర్మన్ ఆర్.ఉపేంద్ర శెట్టి అధ్యక్షత వహించనున్నారు. ఈ మేరకు సంస్థ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

రాష్ట్ర ఆర్యవైశ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో

రేపు మెగా స్కాలర్‌షిప్‌ల పంపిణీ

బెంగళూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆర్య వైశ్య చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో 2023-24 వార్షిక ఉన్నత విద్యా స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం ఈ నెల 11న జరుగనుంది. ఈ మేరకు స్కాలర్‌షిప్ కమిటీ ఛైర్మన్ కేఆర్ ప్రదీప్ ట్రస్టు అధ్యక్షుడు ఐఎస్ ప్రసాద్ నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు జయనగర్ 3వ బ్లాక్‌లోని ఎన్ఎంకేఆర్‌వి కళాశాల మైదానంలో జరిగే ఈ కార్యక్రమంలో హోం మంత్రి డాక్టర్ జీ పరమేశ్వర, రవాణా, దేవాదాయ శాఖా మంత్రి ఆర్.రామలింగారెడ్డి, బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు తేజస్వి సూర్య, విధానపరిషత్ సభ్యుడు డీఎస్ అరుణ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. ఉన్నత విద్యారంగంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ప్రతియేటా స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

కేరళ తరహా గౌరవ వేతనం ఇవ్వాలి

▸▸ గ్రామ పంచాయతీ సభ్యుల డిమాండ్

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 9: కేరళ తరహా గౌరవ వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర గ్రామపంచాయతీ సభ్యుల మహా సమాఖ్య పిలు పుతో తాలూకా గ్రామపంచాయతీ సభ్యులు బెంగళూరు ధర్నాకు బయల్దేరారు. సమాఖ్య రాష్ట్ర అ ధ్యక్షుడు కాడ శెట్టి సతీశ్ నేతృత్వంలో బెంగళూరు ఫ్రీడంపార్కులో ఏర్పా టైన సమావేశానికి తాలూకా నుంచి బయల్దేరారు. శిడ్లఘట్ట తాలూకా గ్రామ పంచా యతీ సభ్యుల పదాధికారుల వాహనాలకు తాలూకా అధ్యక్షుడు బెళ్ళూటి సంతోష్ పచ్చజెండా చూపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, సభ్యులకు కేరళ తరహాలో గౌరవధనం ఇవ్వాలన్నారు. అధ్యక్షులకు రూ.15వేలు, ఉపాధ్యక్షులకు రూ.12వేలు, సభ్యులకు రూ.7వేలు ఇవ్వాలన్నారు. లోక్‌సభ, శాసనసభలకు ఎంపికైతే సభ్యత్వ గడువు అనంతరం పింఛను ఇస్తున్న తరహాలనే తమకు కూడా పింఛను సదుపాయం కల్పించాలన్నారు. సభ్యులందరికీ జిల్లాస్థాయిలో పర్యటించేందుకు బస్ పాస్ వ్యవస్థ కల్పించాలని, ఆరోగ్యబీమా కార్డు ఇవ్వాలని, ప్రతి నెలా జనరల్ మీటింగ్‌కు ఇస్తున్న భత్యాన్ని రూ.300 నుంచి రూ.500కు పెంచాలన్నారు. పంచా యతీ సమావేశాలు సజావుగా కొనసాగేలా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి పంచాయతీకి బాధ్యతగా అప్ప గించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ సభ్యు ల మహాసమాఖ్య శిడ్లఘట్ట తాలూకా ఉపాధ్యక్షులు దొడ్డదాసరహళ్ళి లక్ష్మీదేవి దేవరాజ్, భక్తరహళ్ళి చిదానందమూర్తి, తుమ్మనహళ్ళి పంచాయతీ అధ్యక్షులు ప్రేమా రమేశ్, ఉపాధ్యక్షుడు మారుతి, అత్తిగానహళ్ళి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు కమ్మసేవా సమితి ఆత్మీయ సమావేశం

మహదేవపుర, ఫిబ్రవరి 9: కాకతీయ కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 11న ఆత్మీయ సమావేశం జరగనుంది. మారతహళ్ళి సమీపంలోని న్యూ హారిజన్ కళాశాల ఆడిటోరియంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 3వరకు జరిగే సాఫ్ట్‌వేర్ నిపుణుల సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఏడీజీపీ (ఇంటర్నల్ సెక్యూ రిటీ) విచ్చేయనున్నారు. ఏపీ ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, చార్టెర్డ్ అకౌంటెంట్ అనుమోలు బాలమురళి కృష్ణ, జనతా రాణి ట్రస్టు డైరెక్టర్ యలమంచిలి వాసు దేవ రావు, బెంగళూరు సౌత్ సెంటర్ అధ్యక్షుడు రవీంద్రనాథ్ నాయుడు, హార్వెస్ట్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ గద్ది పాటి రాం ప్రసాద్, ఫౌండర్ అండ్ సీఈఓ ఇడి క్వార్ట్ సెలిహ ముమ్మా, ఫిలోమినస్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ చంద్రయ్య నాయుడు, గాలి భాను ప్రకాశ్ తదితరులు హాజరు కానున్నారని కాకతీయ కమ్మసేవా సమితి వ్యవస్థాపకుడు రామారావు గంగవరపు, అధ్యక్షుడు దిలీప్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమితి పదాధికారులు చైతన్య మాదాల, శ్రీనివాస్ ముమ్మనేని పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్యారమ్స్ పోటీలకు ఇద్దరి ఎంపిక

▸▸ తాలూకా నుంచి సుందరచారి, నరసింహప్ప


పోటీలకు ఎంపికైన సుందరచారి, నరసింహప్ప

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 9: బిహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే జాతీయస్థాయి కేరం పోటీలకు శిడ్లఘట్ట పట్టణానికి చెందిన సుందరచారి, టీటీ నరసింహప్ప ఎంపికయ్యారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ కేరం పోటీలు 2023-24 సంవత్సరానికి పాట్నాలో జాతీయస్థాయిలో ఈనెల 10 నుంచి 15వరకు పోటీలు జరుగనున్నాయి. కేరం విభాగంలో శిడ్లఘట్ట పట్టణానికి చెందిన టీచర్ సుందరచారి, ఆరోగ్యశాఖ టీటీ నరసింహప్పలు ఎంపికై రాష్ట్రంనుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర జట్టు తరపున ఆరుగురిలో సుందరచారి, నరసింహప్పలు ఉన్నారు. చిక్కబళ్లాపుర జిల్లా నుంచి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా జట్టు నుంచి కేరం సింగిల్స్‌లో సుందరచారి 13వసారి విజేతగా రాష్ట్రస్థాయిలో గెలుపొంది జాతీయస్థాయికి ఎంపికయ్యారు.